

# కథా కౌముది

## జీవన చిత్రం పి.ఎల్.ఎన్.మంగారత్నం



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

సూర్యుడు పశ్చిమానికి దిగుతుండడంతో..

వాతావరణంలో వెచ్చదనం తగ్గి, చల్లనిగాలి తిరిగింది. అప్పటివరకూ ఆహారం కోసం బయటకి వెళ్ళిన పక్షులు నెమ్మదిగా చెట్ల మీదకు చేరి కిలకిలారావాలు చేస్తూ, హాయి గొల్పుతున్న .. ఆ సాయం సమయంలో..

మా ఆఫీసరుగార్ని కలవడానికి వచ్చిన జనాలతో.. ఆఫీసు ఆవరణ అంతా కోలాహలంగా ఉంది.

ఆరోజు చెయ్యాల్సిన పని అంతా చేసేసి ..

పెట్టాల్సిన ఫైళ్ళు అన్నీ 'అడ్మిన్ మేడం'గారి టేబుల్ మీదకు పంపెయ్యడంతో. కాస్త ఊపిరి పీల్చుకున్నా, సీటులో పెండింగ్స్ ఏమిలేవన్న సంతోషంతో.

ఏ డిపార్టుమెంటులో ఏమో గాని .. రెవెన్యూలో పెండింగ్స్ ఉండవనేది నమ్మే విషయం కాకపోయినా .. కూర్చుని తింటే కొండలైనా కరుగుతాయన్నట్లు, చేస్తూ పోతుంటే పనీ తరుగుతుందని నా అభిప్రాయం.

ఇంకో అరగంట ఆగితే, ఇంటికి బయలుదేరవచ్చు అనుకుంటుండగా ..

" సార్ పిలుస్తున్నారు .. మేడం " అంటూ వచ్చి చెప్పాడు ఆఫీసరుగారి గుమ్మం దగ్గర ఉండే దఫేదారు.

' అమ్మో! ఏ ఫైలు మీద పిలుస్తున్నారో! ఏం తప్పు కనిపించిందో! ' అనుకుంటూ భయం భయంగానే లేచాను. ఎన్నాళ్ళు సర్వీసు చేసినా ఆఫీసరుగారు పిలిచారంటే భయమే.

అప్పటికి కొత్త ఆఫీసరు 'ఆగమనరావు' గారు వచ్చి పదిహేను రోజులే అయ్యింది. ఈ ఫిబ్రవరి ఒకటినే జాయిను అయ్యారు.

వెళ్లి విష్ చెయ్యగానే ..

'ఓ మూడు ఫైలు నెంబర్లు చెప్పి " అవి ఏమిటి?" అని అడిగారు.

ఒకసారి ఫైలు వ్రాస్తే నాకు అన్నీ గుర్తే " అవి పట్టాదారు పాసు పుస్తకాలకి చెందిన ఫైళ్ళు సార్! ఆ మూడూ తాళ్ళరేవు మండలానికి చెందిన ఒక్క కుటుంబానికే చెందిన వాళ్ళు .. మూడు గ్రామాల నుంచి ఫైలు చేసారు. మొన్ననే జడ్జిమెంట్లు కూడా అయ్యాయి" చెప్పాను టూకీగా.

ఫైలు నెంబర్లు కూడా గుర్తు పెట్టేసుకుని .. అంత ఫింగర్ టిప్స్ మీదే సమాధానం చెప్పేస్తానని అనుకుని ఉండరు.

" ఒకసారి ఫైళ్ళు తీసుకురా!" అన్నారు.

క్షణంలో ఫైళ్ళు ముందు పెట్టాను.

పది నిముషాల పాటు అన్నీ పరీక్షగా చూసి " ఈ ఫైళ్ళకి జడ్జిమెంట్లు అయిన తరువాత కూడా .. పార్టీలని కోర్టుకి రమ్మని నోటిసులు పెట్టావంట ఏంటి?" అడిగారు విసుగ్గా.

ఆ మాటకి ఖంగు తిని, దెబ్బ తిన్నట్లు చూసాను.

అలా జరిగే అవకాశం లేదన్నట్లు.

"జడ్జిమెంట్ల తరువాతి తారీకులతో నోటిసు ఉన్నాయని, ఎవరో లాయరు కలెక్టరుగారికి కంప్లయింట్ చేసాడట. 'మీ కాకినాడ డివిజన్లో పాలన ఇలా ఉంది' అన్నట్లు విమర్శించాడట" అన్నారు కోపంగా.

అప్పటికి జరిగింది అవగతం అయ్యింది.

డివిజినల్ ఆఫీసర్లు .. ఎలక్షను ఆఫీసర్లు కూడా కావడంతో ప్రతి సంవత్సరం జనవరి 25 జాతీయ ఓటర్ల దినోత్సవం నాటికి కొత్త ఓటరు జాబితాలు విడుదల చెయ్యాల్సి వుంటుంది.

ఆ కారణంగా ..

ముందు ఆఫీసరు 'డేనియల్' గారిని అప్పటి నిభందల మేర, కాస్త ముందుగానే ట్రాన్స్ఫర్ చేస్తూ .. జనవరి నెలాఖరున రిలీవ్ కావలసిందిగా ఆదేశించింది గవర్నమెంటు.

అలా జనవరి నెలాఖరు వరకూ కొనసాగిన డేనియల్ గారిని ..

రొటీనుగా, జనవరి 'మొదటి వారం'లో పెట్టిన .. నోటిసులు అందుకున్నదరఖాస్తుదారులు వచ్చి కలవడంతో, ఆ ఫైళ్ళు సీ.సీ 'మూర్తిబాబు' ద్వారా అడిగి తెప్పించుకున్నారు.

ఆ ఫైళ్ళతో పాటు .. మరికొన్ని ఫైళ్లు కూడా కావాలంటే, ఇచ్చి పంపించాను.

చివరికి ..

మిగిలిన ఫైళ్ళు 'ఏమీ ఏక్షన్ లేకుండా' తిరిగి వచ్చినా ..

తాళ్ళరేవు మండల ఫైళ్ళుకు మాత్రం జడ్జిమెంట్లు తయారయ్యాయి, అదీ ' నెల రోజుల ' వెనుక తారీకుతో .. అంటే, ' ముందు సంవత్సరం డిసెంబరు నెల 24 తారీకుతో వచ్చాయి. అదే డేనియల్ గారి పిరియడ్లో చివరిగా హియరింగ్స్ జరిగిన రోజు.

అంటే, తెలియకుండా కొత్త సంవత్సరమూ వచ్చేసింది.

ఆ తారీకుని గుర్తు పెట్టుకున్నారు గానీ, జనవరి నెలలో ఉన్న నోటిసుల్ని పట్టించుకోలేదు.

అదే ఇప్పుడు నోటిసులు వ్రాసిన క్లర్కుగా 'నన్ను' ఇబ్బంది పెట్టింది.

వారం రోజుల క్రిందట, డిస్పాచ్ కి ఇచ్చేటపుడు .. తారీకు చూస్తే కంగారు వచ్చింది.

ముందు సంవత్సరం డిసెంబరులో తయారయిన జడ్జిమెంట్లు .. ఫిబ్రవరి వచ్చేంత వరకూ, అంటే, నెలన్నర పాటు .. నేనే దగ్గర పెట్టేసుకుని, గుర్తు వచ్చినపుడు డిస్పాచ్ కి ఇచ్చిన్నట్లు అవుతుందని ..

వెంటనే, ఎడ్మిన్ మేడం ' రూపాంజలి' గారి దగ్గరకు వెళ్ళి విషయం చెప్పాను.

ఆవిడ ఫైలు అంతా చూసి, "వెళ్ళిపోయిన ఆఫీసరుగారు వెనుక తారీకు వేస్తే, మనం ఏమి చెయ్యగలం. వెంటనే డిస్పాచ్కి ఇచ్చెయ్యండి " అని అనడంతో వెంటనే డిస్పాచ్ చేయించాను.

అప్పుడు ..

అదే విషయం గుర్తు చేసుకుని మరీ చెప్పాల్సి వచ్చింది .. ఆఫీసరుగారికి.

అంతగా నమ్మినట్లు లేదు " ఫిబ్రవరిలో నేను ఉన్నాను కదా! నాకు ఎందుకు చెప్పలేదు?" అడిగారు.

అందుకు నా దగ్గర సమాధానం లేదు.

ఎడ్మిన్స్ ఉండగా, ముందుకు వెళ్ళాలని అనుకోరు క్లర్కులు. నేను అందుకు అతీతం కాదు.

పైగా ఆ సమయంలో కొత్త ఆఫీసరుగారిని కలిసివెళ్ళే వారితో కిటకిటలాడింది ఆఫీసు.

ఇంకా జరిగింది చెప్పాలని ప్రయత్నించినా వినేలా కనిపించలేదు.

" వెళ్ళండి. మెమో ఇష్యూ చేస్తాం .. అప్పుడే చెప్పుకుందురు గాని" అనడంతో చేసేది లేక వెనుదిరిగాను. తప్పులంటూ చేస్తే క్రింది స్థాయి ఉద్యోగులే చెయ్యాలి అన్నట్లు.

కాస్సేపటికి తేరుకుని ..

ఎడ్మిన్ మేడంని కలవడానికన్నట్లు వెళ్ళాను, ఆవిడ చాంబర్లోకి.

అప్పటికే, ఆవిడ 'ఆ' ఫైళ్ళతో కుస్తీ పడుతుంది. ఎదురుగా సీనియర్ అసిస్టెంటు విజయలక్ష్మిని కూర్చో బెట్టుకుని మరీ.

అసలు చెప్పాలంటే ఆ పట్టాదారు పాసు పుస్తకాల సీటు, విజయలక్ష్మిదే. చాలా రోజులుగా ఆమే చూస్తుంది.

ఆమెకు దీపావళి లైసెన్సుల సబ్జక్టు కూడా ఉండడంతో, ఆ దీపావళి సమయంలో వందల కొలదీ దరఖాస్తులు రెన్యువల్ కోసం రావడంతో పని వత్తిడి ఉంటుంది. రాత్రి ఎనిమిది గంటలు దాటేంత వరకూ పని చేసేవారట, సంభందితులూ. అలాగే అడ్మిన్ కూడా.

కాబట్టి, రూపాంజలిగారు " మీరు కొద్ది రోజుల పాటు ఈ పాసు పుస్తకాలకు నోటిసులు పెట్టండి చాలు. మిగిలిన పని అంతా మేం చూసుకుంటాం. అప్పటికి ఈ దీపావళి హడావుడి వదిలి పోతుంది" అంటే, చూసిన పని.

వాళ్ళకి దీపావళి హడావుడి వదిలినా, నా దగ్గర .. నాది కాని, పాసు పుస్తకాల సబ్జక్టు అలాగే ఉండిపోయింది.

నాకు విషయం వివరించి చెప్పే కష్టం లేకపోయినా ..

ఆ పరిస్తితి అవమానంగానే అనిపించింది.

" ఆ ఫైల్స్ మీద ఆర్డర్స్ ఏమీ లేకపోతేనే కదా! మీరు నాకు నోటిసులు పెట్టమని ఇచ్చింది" అన్నాను గొంతు పెగల్చుకుని.

పెట్టిన ఆ నోటిసుల మీదా ఆవిడే సంతకం చేసింది కూడా.

" ఏమో సార్! మేమో ఇవ్వమన్నారు" అని సీరియస్గా మరే ప్రశ్నకీ తావులేకుండా ఆవిడ ఆ పనిలో పడింది.

అప్పటికి కను చీకటి ముసురుకుంది.

★★★

మర్నాడు వెళ్లేసరికి..

ముందురోజు తుఫాను ఛాయలేవీ, కనిపించకపోయినా .. విషయం చాప క్రింద నీరులా ఉండి పోయింది, ఆ మధ్యాహ్నం ..

డిస్పాచ్ క్లర్కు వెంకటాద్రి వచ్చి 'చార్జ్ మేమో' చేతిలో పెట్టేంత వరకూ.

'ప్రభుత్వ విధుల పట్ల నిర్లక్యం వహించి .. జడ్జిమెంట్ల తరువాత నోటిసులు పెట్టినందుకు గానూ, వివరణ కోరుతున్నాం. ఈ మేమో .. అందిన మూడు రోజుల్లో వివరణ ఇవ్వవలసిందని లేనిచో చట్టప్రకారం చర్యలు చేపడతామనీ' దాని సారాంశం.

" జరిగినది అంతా మీకు తెలుసు. కొత్తగా నేనేం వ్రాసి ఇవ్వను " అన్నాను కాగితం చేత్తో పట్టుకుని .. రూపాంజలిగారి దగ్గరకు వెళ్లి..

“ చూడండీ, ఆరోజు మీరేం ఫైళ్ళు పెట్టారో! నేనేం సంతకాలు చేసానో! నాకు గుర్తు లేదు. గుండు గుత్తగా ఇస్తే .. నమ్మకం మీద పెట్టేసి ఉంటాను. అయినా వెళ్ళిపోయిన ఆఫీసరుగారు వెనుక తారీకు వేసారని .. మీరేం అనగలరు? ఆ విషయం మనం నిరూపించగలమా? ఏదో చూసీ చూడడంలో .. పొరపాట్న ఆ మూడు వాటికి కూడా .. నోటిసులు పెట్టేసానని చెప్పుకోండి. అంతకు మించి గత్యంతరం లేదు ” అంది తనదైన దోరణిలో.

ఆవిడ వంక విస్మయంగా చూసాను.

“ అంటే, చెయ్యని నేరం వప్పుకోమంటారా? అలా వ్రాసి ఇస్తే కలెక్టరుగారు నాకు ‘ముందే’ పనిష్మెంట్ ఇవ్వరా? అలా చెబితే .. నన్ను నేను హేంగ్ చేసుకున్నట్లే కదా! ” ఆవేశపడ్డాను.

నా వెనుకే.. విజయలక్ష్మీ, మూర్తిబాబులు కూడా వచ్చారు.

వాళ్ళూ పరిస్తితిని గమనిస్తూ ఉన్నారన్నట్లు.

ఏం ఉపోద్ఘాతం లేకుండానే “ మీ సమాధానంలోకి మమ్మల్ని లాగకండి .. మేడం ” అంది విజయలక్ష్మి.

ఆమెకి తెలీదూ నేను ‘ఎలక్షను’ సీనియర్ అసిస్టెంటుననీ, నాకు ఆ సబ్జక్టుతో ఏ సంభంధం లేకపోయినా ఎడ్మిన్ చూడమంటేనే .. కాదనలేక, పై అధికారి మాటలకు తలవొగ్గి, చూశానని.

“ అంతే .. అంతే ” అన్నాడు మూర్తిబాబూ కూడా. అతను తన డైరీలో వ్రాసుకుని వచ్చి మరీ ఫైళ్ళు పట్టుకెళ్ళాడు.

అందరూ ఒక్క మాట మీద ఉండిపోయారు.

“ అంటే, నేనెలా? పోయినా మీకు అవసరం లేదన్నమాట” మధన పడ్డాను.

ఆవిడా, వాళ్ళిద్దరి తరుపునా వకాలత్ పుచ్చుకున్నట్లు “ ఏమో! మేం చెప్పాల్సింది చెప్పాం. మీ మంచికే అన్నట్లు. ఆ పైన, మీ ఇష్టం ” అంటూ ఫైళ్ళలో తలదూర్చింది.

“ఆఫీసు అంటే .. నా ఒక్కదానితోనే ఉందన్న మాట” గట్టిగా అరిచాను.

అదేం పట్టనట్లు వాళ్ళు .. వేరే విషయాల్లో పడిపోయారు. అంతలోనే జోకులూ .. నవ్వులూ.

అప్పుడే అనిపించింది.

‘ఏం జరిగినా .. ‘చెయ్యని పని’ చేసినట్లుగా అంగీకరించకూడదని’.

అప్పటి నుంచీ ..

ఎదుటి వాళ్ళు చూసే చూపులు నన్ను ఇబ్బంది పెడుతున్నాయి. కష్టం అనేది రాకూడదు గానీ .. వస్తే మన నీడే మనల్ని భయపెడుతుందన్నట్లు .. ఏ ఇద్దరు కలిసి నవ్వుకున్నా నన్ను గురించే అన్న అనుమానం.

అంతా స్తబ్దుగా తయారయ్యింది.

నా వివరణకి సంతృప్తి చెందని మా ఆఫీసరుగారు ..

మరో గెజిటెడ్ ఆఫీసరు శ్రీనివాసరావుని ఎంక్వయిరీకి వేసారు.

ఎన్నో.. ఎన్నో ప్రశ్నలు. వాటికి సమాదానాలు చెప్పడమే పని అయిపోయింది. అతనూ బాగా పరిచయం అయిన వారే. అయితే 'ఇప్పుడు' ఎదుటి వరుసలో కూర్చున్నారు.

ఎంతో పరిశీలించిన తరువాత .. ఆ మూడు ఫైళ్లలోనూ ..

రెండు ఫైళ్ళ పై అడ్మిన్ గారి సంతకాలు మిస్సింగు.

అంటే, ఆఫీసరుగారు ఆరోపిస్తున్నట్లు .. నేనే నోటిసులు వ్రాసేసి, నా అంతట నేనే బయటకు పంపేసినట్లు అయిపోయింది.

ఈ విషయంలో డిస్పాచ్ గుమస్తా మాత్రం గట్టి పట్టు మీదే ఉన్నాడు. " నేను అడ్మిన్ మేడంగారి సంతకాలు గానీ, పచ్చరంగు ఇంకుతో పెద్ద సార్ సంతకాలు గానీ లేకుండా .. ఎప్పుడూ డిస్పాచ్ చెయ్యను సార్! అన్నీ బాగా చూసిన తరువాతే బయటకి పంపుతాను. పదిహేనేళ్ళుగా ఇదే సీటులో ఉండి, పని చేస్తున్నాను .. ప్రమోషను కూడా వద్దనుకుని. 'ఆఫీసు కాపీ'లకి సంతకాలు మిస్ అయితే, అయిఉండ వచ్చుగాని, ఫెయిర్ కాపీలు అన్నీ 'చూసే' డిస్పాచ్ చేసాను" అంటూ ఘంటా బజాయించి చెప్పడమే కాదు డిస్పాచ్ రిజిస్టరు కూడా చూపించాడు.

ఆరోజు నోటిసులు ఇచ్చింది మొత్తం పన్నెండు ఫైళ్ళు.

రూపాంజలిగారు ఎంత హడావుడి మనిషో, ఎంత మతిమరపు మనిషో అందరికీ తెలుసు. 'ఆఫీసు కాపీ'లు మన ఫైల్లో ఉండేవే .. ఎప్పుడైనా పెట్టించుకోవచ్చు అన్న ధోరణి ఆమెది.

" అది చాలా తప్పు .. ఫైళ్ళు ముందు పెట్టుకుంటే, కాగితాలు మాట్లాడాలే గాని .. మనం మాట్లాడకూడదు. రేపటి రోజున ఏం జరుగుతుందో! ఎవరికి ఏం తెలుసు? క్షణాల మీద ఎవరికో ట్రాన్స్ఫర్లు కావచ్చు. అప్పుడు పరిస్థితి ఏమిటీ?" అని చెప్పే .. నేను 'ఆ' సారి గమనించుకోలేకపోయాను.

అదీ నా నిర్లక్యం అనుకునేలా ..

వెంకటాద్రి వాదన నాకు కాస్త ఊరట నిచ్చింది.

అయినా, ఎన్నో తర్జనభర్జనల తరువాత 'తప్పు చేసావు' అంటూ, పదిహేను రోజులకి .. కలెక్టరు ఆఫీసుకి 'సరెండర్' చేసారు నన్ను.

' సారీ' అమ్మా! నిన్ను సేవ్ చెయ్యాలని అనుకున్నా వీలుకాలేదు. నీ తరుపున మాట్లాడానని సార్! కోపం తెచ్చుకున్నారు నా మీద " చెప్పారు శ్రీనివాసరావుగారు.

కొత్త ఆఫీసరుగారికి తను 'లేనప్పటి' పరిస్తితిని నమ్మాల్సిన అవసరం ఏమిటి?

విజయలక్ష్మి అయితే, చేతులు పట్టుకుంది ' సారీ! మేడం" అంటూ. అలానే రూపాంజలి గారు కూడా. ఆ మాటలు ఎందుకు ఉపయోగపడతాయి .. అప్పుడు నాకు.

అవమానం భారంతో బయటకి నడిచాను.

★★★

ఆ మరునాడే ..

నా సరెండరు కాగితాన్ని జోడిస్తూ ., జరిగిన దానికి, వివరణ ఇస్తూ .. కొత్త పోస్టింగు ఇవ్వండని కలెక్టరు ఆఫీసులో దరఖాస్తు చేసాను.

ఎప్పటి విషయాలు అప్పుడు అక్కడికీ తెలుస్తూనే ఉన్నాయి.

మా డివిజినల్ ఆఫీసూ .. కలెక్టరు ఆఫీసూ ఎదురూ బదురే. మధ్యలో రోడ్డే అడ్డం.

“ ఏ తప్పూ చెయ్యకపోతే .. సరెండరు ఎందుకు? చేస్తారు?” అన్నది అక్కడి ప్రశ్న.

అప్పుడపుడూ వెళ్లి కలుస్తున్నా ఎవ్వరికీ తీరికలు ఉండడం లేదు.

ఎప్పుడూ మీటింగులూ, వీడియో కాన్ఫరెన్సులు అంటూ ఉరుకులూ, పరుగులే.

అడిగే ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు చెబుతున్నా పరిస్థితి ఎక్కడ వేసిన .. గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోయి .. చూస్తుండగానే నెల గడిచి పోయింది.

★★★

నా మాట విశ్వసిస్తూన్నవాళ్ళు లేకపోగా ..

అక్కడా వ్యతిరేక పవనాలే వీచడం కనిపించింది. అసలు విషయం కలెక్టరుగారి దృష్టికి వెళ్లిందో! లేదో! అన్న అనుమానమూ పట్టుకుంది.

అందుకే ..

మరో అర్జీ వ్రాసుకుని కలెక్టరు ‘ గోపాలకృష్ణయ్య ’ గారిని కలుసుకున్నాను.

“ సార్! నేను ఏ పొరపాటూ చెయ్యలేదు. మా ముందు ఆఫీసరు డేనియల్ గారు, నేను జనవరి నెలలో, నోటిసులు ఇచ్చిన, ఫైళ్ళు తెప్పించుకుని జడ్జిమెంట్ల తయారు చేసి, వాటి పై డిసెంబరు నెలలో తారీకు వేసి ఇచ్చారు. ఆ ఫైళ్ళకి .. నోటిసులు పైకి కనిపించేలా ‘సెట్’ చేసి మరీ పంపించాను .. బంగ్లాకి.

“ అయినా, ఆ బంగ్లాలో కూర్చుని జడ్జిమెంట్లు తయారు చేసింది ‘ వెంకటపతిరావు’ గారే. అవి డేనియల్గారు రిలీవు అయిపోయిన తరువాతే .. ఫిబ్రవరిలో అందాయి నాకు ” అంటూ చెప్పుకున్నాను కంగారు కంగారుగా.

ఆఫీసర్ల టైము ఎంతో విలువైనది అని.

వెంకటపతిరావు .. అంటే జిల్లాలో ‘పరిచయం అవసరం లేని పేరు’.

ఎలాంటి కోర్టు కేసుకైనా .. కౌంటర్లు వ్రాయగలిగిన మేధావి. తిమ్మిని .. బమ్మిని చెయ్యగల సమర్ధుడు. ఈ కలెక్టరుగారు వచ్చేటప్పటికి, అతడే అక్కడ సీ.సీ. అయితే, ఎందుకనో! రెండునెలల లోనే ఉద్వాసన పలికారు.

అందుకు కలెక్టరు నవ్వుతూ " నేను చూస్తానులే. ఎంక్వయిరీ చేయిస్తాను " చెప్పారు.

ఆ మాటకి ధైర్యం వచ్చింది. ఇంకా చెప్పాలంటే, కలెక్టరుగారికీ ట్రాన్స్ఫర్ అయ్యింది .. వెళ్లిపోవచ్చు. అందుకే తొందరపడి కలుసుకోవడం.

★★★

ఇప్పుడు జిల్లా రెవిన్యూ ఆఫీసరు 'జ్యోతి' మేడం దగ్గరకు వచ్చింది విషయం.

ఆవిడా ముందు స్టేషన్లో పరిచయమే.

అప్పుడు 'ఆ' నియోజక వర్గానికి ఆవిడ స్పెషల్ ఆఫీసరు. ఆ పరిచయమే కావచ్చు, బాగా విసుక్కుంది.

" ఇంత సర్వీసు చేసి సరెండరు అయ్యావంటే సిగ్గుపడాలి. అసలు ఉద్యోగం వదిలి పెట్టిపోవాలి " అంటూ.

నేనూ అదే సిగ్గుతో ఉన్నాను.

ఇంక రెండేళ్ళు లేదు సర్వీసు. పైగా ప్రమోషన్ లిస్టులో పేరుంది.

ఆవిడ అలా మాట్లాడినా బాధ కలగలేదు. అవేమీ కాగితం మీద లేనందుకు సంతోషించాను.

అంత విసుక్కున్నా ..

నా మాట ఓపిగ్గా విన్నది. 'ఇంటర్ కాం' లో.. నా విషయం ఆరా తీసింది.

" మీరు ఆ విధంగా వ్రాస్తే ఎలా? విషయం ఇక్కడ ఏడ్వర్స్ లో ఉంటుంది కదా! చూస్తాను .. ఫైలు త్వరగా పంపండి నా టేబుల్ మీదకు " అంటూ ఆర్డరు వేసింది.

ఆ మాటకి ఎందుకో జీవం లేచి వచ్చినట్లయింది.

★★★

ఆవిడ చెప్పినట్లే నాలుగు రోజుల తరువాత వెళ్ళాను.

చూడగానే మళ్ళీ విసుక్కుంది.

" ఇంకో సారి ఇలా జరిగిందంటే ఊరుకోను. ఈ సారికి నీ సీటు .. నీకే ఇస్తున్నాం. వెళ్లి రెండు రోజుల తరువాత సెక్షన్ లో ఆర్డర్స్ తీసుకో " అంటూ హుకుం జారీ చేసింది.

ఇక నేను నోరు విప్పదలుచుకోలేదు. ఆ చివరి మాట చెవుల్లో అమృతం పోసినట్లు అయ్యింది. చేతులు జోడించాను.

అప్పుడే విషయాన్ని 'లీక్' చెయ్యదలుచుకోలేదు. విజయలక్ష్మికి చార్జ్ ఇచ్చేసిన తరువాత వదిలేసిన ఆఫీసు వైపు వెళ్ళింది లేదు.

★★★

రెండు రోజుల తరువాత ..

మా డివిజినల్ ఆఫీసు టైపిస్ట్ వరప్రసాద్ నుంచి ఫోను.

“ మేడంగారూ! మిమ్మల్ని ‘మళ్ళీ’ ఇక్కడికే వేసారు. ఆఫీసుకి వచ్చిన వెంటనే మెయిల్స్ చూస్తుంటే .. మీ అర్డర్స్ ఉన్నాయి. వచ్చెయ్యండి” అంటూ.

సంతోషపడ్డాను .. కలెక్టరుగారు నిన్నటిరోజునే రిలీవ్ అయిపోయితూ వేసిన .. ఆర్డర్స్.

అప్పుడే గనుక మేల్కొనక పోయి ఉంటే .. ఇంకా ఎన్నాళ్ళ పాటు చీకటిలో ఉండి పోవాల్సి వచ్చేదో!

ఆఫీసుకి వెళ్లి మెయిల్ కాపీ తీసుకోవడం ..

వెంటనే జాయినింగు రిపోర్టు వ్రాసి, ఏదో గెలుపు సాధించానన్నట్లు మా ఆఫీసరు ఆగమనరావు గారి ముందు నిలుచున్నాను.

నన్ను అలా చూడడం, జీర్ణించుకోలేక పోయినా .. కలెక్టరు ఆర్డర్స్ ని కాదనలేక పోయారు.

గాలిలో ఉన్న రెండు నెలలూ శెలవులు పెట్టుకోవాల్సి వచ్చింది .

ఏ పనిష్మెంటూ లేకుండా బయట పడినందుకు సంతోషపడ్డాను.

అన్ని ఆర్జిత శెలవులు వృధాగా పోయినా గాని.

“ వచ్చేసారా! సంతోషం. జరిగిన దాంట్లో మీ తప్పేమీ లేదని తెలుసు. అసలు ఉద్యోగిని సరెండరు చేసే అధికారం ఏ ఆఫీసరుకీ లేదు. ఏదైనా కలెక్టరుగారికి తెలియచేసి .. ముందుకు వెళ్ళాలి. ఏదో ఇక్కడ అలా జరిగిపోయింది ” అన్నాడు గణాంకాల అధికారి.

అతను ఆఫీసరుగారికి ఇష్టుడు. అవసరానికి తగు సలహాలు ఇవ్వగలడు. అయినా ఇక్కడ ఈగ వాలింది తన మీద కాదు.

రూపాంజలిగారైతే “ వచ్చేసారు కదా! మీరు లేకపోవడంతో .. ఆఫీసు బోసి పోయింది. కళ లేదు. మీ సీట్లో పెండింగు కూడా చాలా ఉండిపోయింది” అంటూ ముఖం విప్పార్చుకుంది.

అవేమీ సంతోషాన్ని ఇవ్వడం లేదు.

పై సీటులో ఉండి, జరిగింది .. జరిగినట్లు చెప్పలేని ఆమె మీద సదభిప్రాయాన్ని కోల్పోయాను. దేశభక్తుడికీ .. దేశద్రోహికీ సరిహద్దు రేఖే అడ్డం.

వందమంది దోషులు తప్పించుకున్నా ఫర్వాలేదు .. ఒక్క నిర్దోషికి శిక్ష పడకూడదు అన్నది మన దేశ శిక్షాస్మృతి. బహుశా అదే నీతి సూత్రం నాకు వర్తించిందేమో!

కలెక్టరుగారికి వెంకటపతిరావు మీద ఉన్న అభిప్రాయమే ..

ఆర్.డీ.ఓ డేనియల్ గారి మీదా ఉంది.

నా రాకకు ఎంతోమంది సంతోషపడినా ..

మా ఆఫీసరులాగే, సంతోషపడని వాళ్ళు 'మరొక'రున్నారు. అదే .. మా డివిజనులోనే వేరే మండలంలో పని చేస్తున్న వెంకటపతిరావు.

అతని పేరు కాగితం మీద పెట్టి, నేను బయటకి వచ్చినందుకు.

★★★

COMMENTS